క్లుప్తంగా

సంఘం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విప్, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాల: సంఘం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మున్నూరుకాపు విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత, విప్ ఆది శ్రీనివాస్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, గౌరవ అధ్యక్షుడు పుప్పాల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

కథలాపూర్: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని కోరుట్ల ఎంవీఐ రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వాహనాల యజమానులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాన్ని డ్రైవింగ్ చేయవద్దని డ్రైవర్లకు సూచించారు. వాహనాల వెంట లైసెన్స్‌లు ఉంచుకోవాలని లేకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. రోడ్డు భద్రత గురించి వివరించే కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ రణధీర్‌గుప్తా

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులకు డాక్టర్ రణధీర్‌గుప్తా పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు విటమిన్ లోపాలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, శరీరంలో గడ్డలు తయారైతే వాటి పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఆస్పత్రుల్లో చూయించుకోవాలన్నారు. పొగాకు,గుట్కాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గంగయ్య అన్నారు. కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని తద్వారా ఉన్నత పాఠశాలల్లో సైతం విద్యార్థుల నమోదు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

అధికారుల విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్‌లో ఉన్న పెట్రోల్‌బంక్‌లో ఎంక్రోజ్‌మెంట్ జరిగిందా లేదా అన్న దానిపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు విచారణ చేపట్టారు. యావర్ రోడ్‌లోని కొత్త బస్టాండ్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో రోడ్‌సైడ్‌లో జనరేటర్ ఉంది. కొందరు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఒక కమిటీ వేశారు. ఇందులో డీఎస్వోతో పాటు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు. శనివారం పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లి ఆ నక్షను పరిశీలించారు. ఎంక్రోజ్‌మెంట్ జరిగిందా లేదా అన్న కోణంలో పరిశీలించారు. ఈ కమిటీ అదనపు కలెక్టర్‌కు నివేదిక అందించిన అనంతరం నిర్ణయం తీసుకోనున్నారు.

ఇసుక డంపుల రక్షణకు తంటాలు

- రైతుల విజ్ఞప్తి మేరకు వరద కాల్వలో ఇసుక దిబ్బలు తొలగింపు
- డంపులపై నిర్ణయం తీసుకోని అధికారులు
- ప్రతిరోజూ కావలాగా సిబ్బంది



ఇసుక నిల్వల వద్ద కాపలాగా ఉన్న లష్కర్

మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్: మండలంలోని రాంలచ్చక్కపేట వద్ద వరద కాల్వలో నుంచి ఇటీవల భారీగా ఇసుకను బయటకు తీశారు. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక రైతులు, జలవనరుల శాఖ అధికారుల అనుమతితో ఇసుకను బయటకు తీసి ఆ శాఖకే అప్పగించారు. అయితే ప్రస్తుతం కాల్వ వద్ద ఉన్న నిల్వలను కాపాడటం ఆ శాఖ అధికారులకు ఇబ్బందిగా మారింది. ఇసుక డంపులను ఏమి చేయాలన్న దానిపై వారికి స్పష్టత లేకపోవడంతో ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడ లష్కర్లను కాపలాగా ఉంచుతున్నారు.

సుమారు 300 ట్రాక్టర్ల నిల్వ..

ఈ గ్రామం మీదుగా వెళ్తున్న వరద కాల్వలో స్థానిక రైతులు మోటార్లు ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా సాగుకు నీటిని వినియోగించుకుంటున్నారు. అయితే అందులో చాలా చోట్ల ఇసుకదిబ్బలు ఏర్పడడంతో సాగునీరు సక్రమంగా అందడం లేదు. వాటిని తొలగిస్తే సమస్య పరిష్కారమవుతోందని భావించిన రైతులు.. ఈ విషయాన్ని స్థానిక జలవనరుల అధికారుల శాఖ దృష్టికి తీసుకపోయారు. వారు ఉన్నతాధికారులతో మాట్లాడి ఇసుక దిబ్బల తొలగింపుకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు రైతులు సొంతంగా ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్‌ను ఏర్పాటు చేసుకుని దానిని బయటకు తీయడంతో నీటి సరఫరాకు ఆటంకాలు తొలగిపోయాయి. అయితే బయటకు తీసిన ఇసుక నిల్వలను అధికారులు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. సుమారు 300 ట్రాక్టర్ల వరకు ఉన్న నిల్వలకు సంబంధించి మైనింగ్ శాఖ దృష్టికి తీసుకపోగా, తాము జోక్యం చేసుకోబోమని ఆ శాఖ అధికారులు చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆ నిల్వలను ఏమి చేయాలన్న దానిపై స్పష్టత కొరవడడంతో ప్రస్తుతం వాటి వద్ద సిబ్బందిని కాపలా ఉంచుతున్నారు.

ఇసుక మాఫియా కన్ను..?

వరద కాల్వ నుంచి తీసిన ఇసుకపై కొందరు కన్ను వేసినట్లు తెలిసింది. ఉదయం నుంచి చీకటి పడే వరకు మాత్రమే అక్కడ సిబ్బంది కాపలాగా ఉంటున్నారు. కానీ రాత్రి సమయంలో ఎవ్వరూ ఉండకపోవడంతో ఇసుక మాఫియా నిల్వలను తస్కరించే అవకాశముంది. మండలంలో పోలీసులు చేపట్టిన చర్యలతో కొంతకాలంగా వాగుల నుంచి ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ఇసుక మాఫియా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో వరద కాల్వకు చెందిన ఇసుక నిల్వలను కాపాడటం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కేసులు నమోదు చేస్తాం

రాంలచ్చక్కపేటకు చెందిన రైతుల విజ్ఞప్తి మేరకు కాల్వలో ఇసుకను తొలగించడానికి అనుమతి ఇచ్చాం. ప్రస్తుతం తమ ఆధీనంలో ఉన్న నిల్వల వద్ద సిబ్బందిని కాపలాగా ఉంచాం. రాత్రి పూట ఎవరైనా తరలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి నిల్వల విషయంలో తదుపరి చర్యలు తీసుకుంటాం.

– అరుణ్‌కుమార్, డీఈ

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి





తిమ్మాపూర్‌లో ఓటరు నమోదు పరిశీలిస్తున్న తహసీల్దార్ పెగడపల్లిలో దరఖాస్తులు స్వీకరణ..

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటర్లుగా నమోదు చేయించాలని తహసీల్దార్ ప్రసాద్ బీఎల్‌వోలకు సూచించారు. మండలంలోని గ్రామాల్లో శనివారం ఓటరు నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు తప్పొప్పులు ఉంటే సవరణ చేయాలని, ఫొటో సరిగ్గా లేకపోతే దాని బదులు కొత్త ఫొటో తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

మల్లాపూర్: ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను శనివారం సందర్శించి బీఎల్వోలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత నూతన ఓటరుగా నమోదు చేయించుకునేలా బీఎల్వోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమాల్లో ఆర్ఐలు రాజేశ్, సురేశ్, సర్పంచ్‌లు బద్దం సరిత, పాలేపు దిలీప్, అలిశెట్టి రవినాగరాజు, భుక్యా రుక్మా, నత్తి లావణ్య, సయ్యద్ హైదర్, బొల్లం కృష్ణవేణి, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు, బీఎల్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటర్ జాబితాలో చేర్చాలని తహసీల్దార్ ఎంఏ ఫరూక్ బీఎల్‌వోలకు సూచించారు. పెగడపల్లి, వెంగళాయిపేట, అయితిపల్లి గ్రామాల్లో శనివారం ఓటరు నమోదును పరిశీలించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై సంబంధిత ఫారాలపై దరఖాస్తులను స్వీకరించాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినా ప్రతి ఒకరి ఓటుహక్కు నమోదు చేయాలన్నారు. బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేసి వారిని గుర్తించాలన్నారు. ఆర్ఐ శ్రీనివాస్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలం కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో పార్కింగ్ స్థలం లేకపోవడంతో లారీలు నిలుపుకునేందుకు ఇబ్బందికరంగా ఉందని, స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లారీ అసోసియేషన్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నామని వారు పేర్కొనడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దేశాయి, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కలీం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లలో కాపర్‌వైర్ చోరీ

మెట్‌పల్లిరూరల్/కథలాపూర్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులోని వరదకాల్వ సమీపంలోని పలువురు రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లలో కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. శనివారం రోజు వారిలాగే రైతులు పంట పొలాలకు వెళ్లగా, మోటార్లలో కాపర్‌వైర్ ఎత్తుకుపోయినట్లు గుర్తించారు.ఎనిమిది మోటార్ల కాపర్ వైర్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు.

కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామశివారులో ఎస్సారెస్పీ వరదకాలువకు బిగించిన వ్యవసాయ మోటార్ల కాపర్‌వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు శనివారం తెలిపారు. ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామాలకు చెందిన రైతుల 20 వ్యవసాయ మోటార్ల కాపర్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధే ఎంపీ అర్వింద్ ధ్యేయం



ప్రొసీడింగ్ అందిస్తున్న భోగ శ్రావణి

రాయికల్: గ్రామాల అభివృద్ధే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మండలంలోని కిష్టంపేటలో శనివారం మున్నూరుకాపు సంఘ భవనం, భూపతిపూర్‌లో ముదిరాజ్ కులసంఘ భవనాలకు ఎంపీ నిధుల నుంచి మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణు, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన భోగ శ్రావణి

అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శనివారం రాయికల్ మండలం భూపతిపూర్‌లోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ఆలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కోరుట్ల రూరల్: ప్రస్తుత సీజన్‌లో వరి పంటలో కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుందని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. మండలంలోని మాదాపూర్‌లో శనివారం వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కాండం తొలిచే పురుగు నివారణకు 15 రోజుల లోపు పంటకు ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ గులికలు, 20 రోజులు దాటిన పైరులో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్తప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ మందును ఎకరానికి 400 గ్రాములు వాడి అరికట్ట వచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లారెడ్డి, గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక

కోరుట్లటౌన్: శ్రీ శంకర దాసమయ్య మేరు సంక్షేమ సంఘం సమావేశంలో అడ్‌హక్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. చైర్మన్‌గా రాంగిరి గణేష్, కార్యదర్శిగా గట్లశ్రీనివాస్, కోశాధికారిగా గట్ల లక్ష్మణ్, సలహాదారులుగా రాంగిరి సత్తయ్య, కర్నె లక్ష్మణ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా గట్ల నవీన్, సంగరవి, సంగ మహేశ్, రాంగిరి లక్ష్మణ్, రాంగిరి శ్రీనివాస్‌ను నియమించినట్లు రాంగిరి గణేష్ పేర్కొన్నారు.

ప్రమాదానికి కారకుడైన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులో జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి, మరో ఇద్దరి గాయాలపాలైన ఘటనకు కారకుడైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని విజయపురికి చెందిన దయాల రమేశ్ (33) శుక్రవారం రాత్రి కల్లెడ నుంచి వస్తుండగా ఎదురుగా వస్తున్న అరవింద్‌నగర్‌కు చెందిన ప్రణయ్ తన ద్విచక్ర వాహనంతో రమేశ్‌తో పాటు, అతని బంధువు గణేశ్ వాహనాలను ఢీకొట్టాడు. దీంతో రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో వారిని రక్షించే ప్రయత్నంలో ఉన్న ధర్మపురి మండలం నేరెల్ల గ్రామానికి చెందిన అక్కినపెల్లి బాబుకుమార్, మామిడిపల్లి సత్తయ్యను తిరిగి వచ్చి మళ్లీ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాబుకుమార్, సత్తయ్యకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి రమేశ్ భార్య మానస ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన ప్రణయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేడీసీసీబీలో నూతన డిపాజిట్ పథకం

పెగడపల్లి: ఖాతాదారులకు మెరుగైన సేవలందించమే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లక్ష్యమని తమ బ్యాంకు ద్వారా సహకార క్రాంతి నూతన డిపాజిట్ పథకం అమలు చేస్తున్నట్లు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు.శనివారం సిబ్బందితో కలిసి మాట్లాడారు. సహకార బ్యాంకులో సహకార క్రాంతి నూతన డిపాజిట్ పథకం అందరికి ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించినట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులను కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ చారి, డెవలప్‌మెంట్ అధికారి అర్జున్, సీఈవో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

జగిత్యాల: జిల్లాలో ఇళ్లులేని ప్రజలు ఇంటి స్థలం కోసం పోరాడుతుంటే అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమని, ఆ కేసులను ఎత్తివేయాలని ఆలిండియా లాయర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది పార్థసారధి అన్నారు. టీఆర్‌నగర్‌లో ఇళ్లస్థలాల కోసం వేసుకున్న గుడిసెలను శనివారం పరిశీలించారు. అమాయక ప్రజలను అరెస్ట్ చేశారని, వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు వెంకటేశ్, మాధవరెడ్డి, కుమార్, సుదర్శన్, సురేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

బుగ్గారం(ధర్మపురి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షా కేంద్రంలో మొత్తం 240 మంది విద్యార్థులను కేటాయించగా 191 మంది పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో భూమయ్య తెలిపారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరిండెంట్‌గా రావులపల్లి వెంకటరమణ, కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

రామాలయంలో స్వచ్ఛ తీర్థ ప్రచారం

కోరుట్ల టౌన్: పట్టణంలోని రామాలయం ఆవరణలో ఆలయ కమిటీ, యూత్ సభ్యులు గుడి పరిసరాలను శనివారం పరిశుభ్రం చేశారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పట్టణంలోని దేవాలయాలు శుభ్రం చేసుకోవాలని పిలుపు మేరకు తీర్థ ప్రచారం నిర్వహించినట్లు మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ మహేశ్, హేమంత్, రామాలయ ఆలయ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

రాయికల్‌లో శ్రీరాముని జెండాలు పంపిణీ

రాయికల్: పట్టణంలో లింగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం 500 శ్రీరాముని జెండాలను నాగారం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఇంటింటికీ జెండాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేస్తున్న సందర్భంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గంప ఆనందం, చింత శివకుమార్, బుచ్చిరెడ్డి, కుర్మ మల్లారెడ్డి, సామల్ల సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

గురువులే సమాజానికి మార్గదర్శకులు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

బుగ్గారం: గురువులే సమాజానికి మార్గదర్శకులని, గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుగ్గారం శ్రీగ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోచమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ నక్క రాజు తన పూర్వ గురువులకు పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేందర్, సర్పంచ్ మూల సుమలత ,నాయకులు సంగనభట్ల దినేశ్, వేముల సుభాశ్, నగునూరి సర్సాగౌడ్, రిటైర్డ్ ఎంఈవో పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

రాయికల్: మండలంలోని కుర్మపల్లి ఒడ్డెలింగాపూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని శనివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచులు మ్యాకల సుమలత, పాలకుర్తి రవి, ఎంపీటీసీలు మోర విజయలక్ష్మి, స్వప్న, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మొట్టమొదటిసారిగా వచ్చిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని శనివారం మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

కుట్రతోనే బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాలజోన్: రాజకీయ కుట్రతోనే బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు బనాయించి, అకారణంగా అరెస్ట్ చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు రాజేశ్వర్‌రెడ్డిని ఓ కేసులో పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడాయన జగిత్యాల స్పెషల్ సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయనను శనివారం కలిసిన సంజయ్ ధైర్యం చెప్పారు. జైలు ఎదుట మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ నాయకులను వెంటాడుతోందన్నారు. అయినా కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు. ఆయన వెంట జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎంపీపీ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకు జాన్, పార్టీ మండల అధ్యక్షుడు బాలముకుందం, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

మల్లాపూర్: ఆధునిక ప్రపంచంలో బాలికలు ఆత్మవిశ్వసంతో ముందడుగు వేయాలని జగిత్యాల సఖీ కేంద్రం నిర్వాహకురాలు మనీలా, ప్రతిమ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి శ్యామల, సామాజిక సేవకురాలు శ్రావణి అన్నారు.మండలంలోని గుండంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో బాలికలు స్వీయ రక్షణ బాధ్యతను గుర్తించి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. బాలికలు, మహిళలు ఆపద సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 181కు ఫోన్ చేస్తే జిల్లా సఖీ కేంద్రం నిర్వాహకులు రక్షణ కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దనరేకుల మల్లు, ఎంపీటీసీ మామిడి మంజుల, ఉపసర్పంచ్ మైలారపు వేణు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చిట్నేని శైలజ జగన్‌రావు వాటర్ ఫిల్టర్‌ను శనివారం అందజేశారు. విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకే వాటర్ ఫిల్టర్ అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

గొల్లపల్లి: మండలంలోని రాపల్లిలో అధికారులు శనివారం వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల గూర్చి వివరించారు. దేశంలోని పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయికి చేరవేయడం కోసమే వికసిత భారత సంకల్పయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల శ్యాం , ఉప సర్పంచ్ సత్యం రావు, పార్టీ అధ్యక్షులు ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి:మండలంలోని దోమలకుంట, ఆరవెల్లి, బతికపల్లి గ్రామాల్లో శనివారం అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు హారిక, లక్ష్మణ్, శోభారాణి, ఎంపీటీసీలు గంగారెడ్డి, అనూర్య, లచ్చయ్య, ఎంపీడీవో పుల్లయ్య,, బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభల్లో పనులు గుర్తింపు

కోరుట్ల రూరల్: మండలంలోని గ్రామాల్లో జీపీడీపీ 2024–25 పనులకు సంబంధించి ఆయా గ్రామ సర్పంచుల అధ్యక్షతన శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీడీపీ తయారీ కోసం శాఖల వారీగా సమాచారం సేకరించి సంకల్ప్ థీమ్‌లకు సంబంధించి ప్రాధాన్యతా క్రమంలో పనులను గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో నీరజ, హెచ్ఎం, విద్యుత్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి

మల్లాపూర్: గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) రూపొందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు గ్రామసభలో పాల్గొని అభివృద్ధి ప్రణాళికకు సూచనలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సయ్యద్ హైదర్, కడకుంట్ల సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మి, ఉపసర్పంచ్‌లు నవీన్, సాదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు అల్పాహారం

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సర్పంచ్ ముస్కు నిశాంత్ రెడ్డి అల్పాహారం కింద రూ.10 వేలు విరాళం అందించగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతకుమారి అల్పాహారం అందజేశారు. అనంతరం జడల రామ్ నాన్నమ్మ మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచులు సత్యనారాయణ, గంగాధర్, పద్మ వెంకటేశ్, రాజ్యలక్ష్మి, తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు నేరెల్ల మహేశ్, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నృసింహుని బ్రహోత్సవాలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులోని శ్రీ ప్రహ్లాదసహిత లక్ష్మీ నరసింహస్వామి బ్రహోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు, మహాసుదర్శన యాగం, లక్ష్మీనరసింహస్వామి యాగం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నేడు జరిగే స్వామి వారి కల్యాణం కోసం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ అంజయ్య,ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: మండలంలోని సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి పరిధిలోని 18 గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా తెలిపారు.

ఉచిత శిక్షణ గడువు పొడిగింపు

జగిత్యాల: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1,2,3,4 ఫౌండేషన్‌కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఈనెల 24 వరకు గడువు పొడిగించినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. డిగ్రీ అర్హత కలిగి ఉండి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం 0878–2268686లో సంప్రదించాలన్నారు.